కనపడలేదు. ఆ ప్రశ్నకి జవాబు తెలీలేదు. తను అవేం కాకపోతే మరి ఎవరా అని ఆతను ఆలోచిస్తూ పడుకున్నాడు.

అతనెవరో మీకు తెలుసా? పోనీ మీరెవరో మీకు తెలుసా? జవాబుకి చిన్న క్లూ. అతనెవరో మీరూ అదే. మీరెవరో అతనూ అదే.

## 24. మంత్ర దీక్ష

నేను రాసిన ఈ తాత్విక కథని ఓ ఆధ్యాత్మిక పత్రికకి పంపితే దాన్ని వాళ్ళు ప్రచురించారు. తత్వవిదానంద స్వామి వారి దగ్గరకి వెళ్ళినప్పుడు ఆ కథని తీసుకెళ్ళి ఇచ్చాను. దాన్ని వారు అప్పటికప్పుడే చదివి ఫకాలున నవ్వుతూ నా వంక చూసారు. వెంటనే అడిగాను.

"కథలో తప్పులేమైనా వున్నాయా స్వామీ?"

"అసలు కథలోని ఇతివృత్తమే తప్పు."

ఆయన్ని వివరించమని కోరితే నాకు ఆ విషయాన్ని ఇలా చెప్పారాయన.

"నీ కథలో ఓ ధనవంతుడు ఒక సన్యాసి దగ్గరకి వెళ్ళి తనకి శివ పంచాక్షరీ మంత్ర దీక్షని ఇవ్వమని కోరుతాడు. 'ఇప్పుడు కాదు. కొంతకాలం అయాక రా.' అని చెప్పి పంపించేస్తాడా సన్యాసి. ఆ తర్వాత మంత్రదీక్ష ఇవ్వమని ఎన్ని సార్లు అడిగినా అతనికి దీక్ష ఇవ్వడు ఆ సన్యాసి. 'మరి కొంతకాలం ఆగి రా' అని ఆ ధనవంతుడ్ని పంపించేస్తూంటాడు. దాంతో కోపం వచ్చిన ఆ సంపన్నుడు, 'నాకు దీక్ష ఇవ్వడం మీకు ఇష్టం లేకపోతే చెప్పండి. ఎందుకు నన్ను మీ చుట్టూ ఇలా పదే పదే తిప్పించుకుంటారు?' అని గట్టిగా అడుగుతాడు.' ఇంతదాకా కరెక్టేగా?" అడిగాడు తత్వవిదానంద స్వామి.

"కరెక్టే స్వామి. మర్నాడు వుదయం సన్యాసి అతనింటికి భిక్షకి వస్తానంటాడు. ఆ ధనవంతుడు రుచికరమైన భోజనం చేయిస్తాడు. మధ్యాహ్నం ఒంటిగంటకి ఆ సన్యాసి తన చేతిలో భిక్షాపాత్రతో వస్తాడు. తను వండించినవన్నీ అందులో వేయబోయి భిక్షా పాత్రలో మట్టి, ఇసక వుండటం చూసి ఆగపోతాడు. అందులో వెయ్యమని ఆ సన్యాసి చెప్తే, 'ఎలా వెయ్యను స్వామి? నేను వడ్డించేదంతా

శుద్ధమైంది. మీ పాత్రని కడగకుండా వడ్డిస్తే అది తినడానికి పనికి రాకుండా పోతుంది.' అని నిరాకరిస్తాడు ఆ ధనవంతుడు." మిగిలిన కథని చెప్పాను.

"ఇంతదాకా నాకు ఎలాంటి పేచీ లేదు. అసలు తప్పు సరిగ్గా ఇక్కడే రాసావు. సన్యాసి ఆ ధనవంతుడితో 'నీ మనసు కూడా నా భిక్షాపాత్ర లాంటిదే. అందులో స్వార్థం, లోభం, గర్వం, ద్వేషం, ధన వ్యామోహంలాంటి అనేక చెత్త నిండి వుంటే, శివ పంచాక్షరీ లాంటి పవిత్రమైన మంత్రం నీకు ఎలా ఇవ్వగలను?' అని ప్రశ్నించాడు సన్యాసి. అవునా?" వెంటనే తత్వవిదానంద స్వామి అందుకుని చెప్పాడు.

"అవును స్వామి! దాంతో జ్ఞానోదయం అయిన ఆ ధనవంతుడు త్వరలోనే తనలోని దుర్గుణాలని వదిలించుకుంటాడు. ఓ శుభోదయాన ఆ సన్యాసే ఆ ధనవంతుడింటికి వచ్చి అతనికి మంత్రదీక్ష ఇస్తాడు."

"అది కదా ఆ కథ ద్వారా నువ్వు చెప్పదలచుకుంది. పిచ్చివాడా! పవిత్రుడైన ఆ ధనవంతుడికి అప్పుడు ఇక శివపంచాక్షరీ మంత్రంతో ఏం పని? అపవిత్ర దశలో వున్నవాడికే ఆ మంత్ర దీక్ష అవసరం. ఆ మంత్రాన్ని జపించగా, జపించగా అతనిలోని చెడు భావాలన్నిటినీ ఆ మంత్రం శుభ్రం చేసేస్తుంది. అశుభ్రంగా వున్న గదికి చీపురు ఎలా అవసరమో, అలా వివిధ దుర్గుణాలు గలవాడికే ఏదైనా మంత్ర దీక్ష అవసరం." వివరించారు ఆయన.

## 25. అంధత్వం

ఓ గుడ్డి పిల్లవాడు రైల్వే ప్లాట్‌ఫాం మెట్ల మీద కూర్చుని, తన పక్కన ఓ చిన్న సత్తు పాత్రని వుంచాడు. ఆ పక్కనున్న చిన్న బోర్డు మీద ఇలా రాసి వుంది.

'నేను గుడ్డివాడ్ని. దయచేసి దానం చేయండి.'

ఆ సత్తు గిన్నెలో చాలా తక్కువ నాణాలు వుండటం అతని పక్క నించి వెళ్ళే ఒకతను చూసాడు. అతను ఆగి ఆ బోర్డు మీద రాసి వున్నది చదివి 'నేను గుడ్డి వాడ్ని' అన్న పదాలని కొట్టేసి అక్కడ ఇంకేదో రాసి వెళ్ళాడు. తర్వాత అతని సత్తు గిన్నెలో ఎప్పటికన్నా ఎక్కువ డబ్బు పడసాగింది. ఆ సాయంత్రం తిరిగి